# జరీ అంచు తెల్లచీర

— కొండేపూడి నిర్మల



'తెగ తపించి పోయావటగా దీనికోసం' అన్నాడు కనకరావు ఫెళ్ళున నవ్వి.

అయోమయంగా అందుకుంది విశాలక్షి.

జరీ అంచు తెల్లచీర!

పాముని చూసినట్టు ఉలిక్కిపడి మంచం కోడు మీద పెట్టేసింది.

'కట్టుకుని రా చస్తున మళ్ళీ బెట్టొకటా' కార్యం పెళ్ళికొడుకు కనకారావుకి అసహనం ముంచుకొచ్చింది.

విప్పకునిరా చస్తున మళ్ళీ సిగ్గొకటా నీ బతుక్కి అని వినిపించినట్టనిపించింది విశాలాక్షి కెందుకో.

ఎవరు... ఎవరు చెప్పారు వీడికి తనకా చీరంటే అంతిష్టమని... అంతా అబద్ధమే యింకె ప్పుడూ యిష్టం కాదు.. అవమానంతో ప్రాణం చచ్చిపోయినట్టనిపించింది. కుష్ఠు బిచ్చగత్తెలా జోలె పట్టుకుని అడుక్కుంటున్నట్టు ఆ జోలెలో కనకారావు బిచ్చం వేసినట్టూ కూడా అనిపించింది.

'ఇదొక డ్రామానా మళ్ళీ, అంతా చెప్పాడు నీ అన్న...' కనకారావు వెటకరించాడు.

గుండె గుబగుబలాడింది విశాలాక్షికి.

అంతా చెప్పేశాడా... అంటే ఎంత... నా చెల్లెలు వెర్రిబాగుల్దిరా ఆరో యేటి నుంచీ పదహారో ఏటిదాకా వెధవ జరీ అంచు తెల్లచీర కోసం కళ్ళు వాచేలా ఏడుస్తూనే వుంది. నువ్వు కనక ఒక్కటి కొని దాని మొహాన కొట్టావంటే పెళ్ళిదాకా ఎందుకు యివాళే నీ కాళ్ళమీద పడిపోతుందని చెప్పాడా? ఈ కాళ్ళమీద పడిపోయే శుభ ముహూర్తానికి ముందు బతికుండగా ఆ కనకారావుని చేసుకోను చేసుకుంటే నా శవానికి చేసుకోండి అంటూ రైలు కట్టమీద పరిగెత్తడం, ఈడ్చుకుంటూ చెంపలు వాయించుకుంటూ అన్నయ్య గదిలో పెట్టి గొళ్ళెం బిగించడం, మూడ్రోజులపాటు పస్తులుండి ముక్కోటి దేవతల్నీ శపిస్తూ కుళ్ళి కుళ్ళి ఏడవడం- అన్నీ చెప్పాడా, ఆ ఒక్కటే చెప్పాడా... వీడి డబ్బుల్తో హోటళ్ళకి తిరిగి, బూతు సినిమాలు చూసి, బ్రోకరు పన్లు చేసిపెట్టే పోరంబోకు వెధవలాంటి అన్నయ్య చెల్లెల్ని గురించి యింకేం చెప్తాడు.

విశాలాక్షికి మొహమంతా కందగడ్డలా మారిపో యింది.

'వూరంతా తిరగాడ్డగా మీ అయ్యా మన్నయ్యా పదిహేన్రూపాయలెట్టి పట్టుచీర కొనేద్దామని...' మళ్ళీ నవ్వాడు కనకారావు.

సాధారణంగా కనకారావు నోట్లో వుండేది పొగ లేదా వెటకారం.

పొగ సిగరెట్టు తగలబెట్టినప్పడొస్తుంది. వెటకారం మనిషిని తగలబెట్టడానికి కొస్తుంది.

విశాలాక్షికి వొళ్ళంతా తగలబడి పోతున్నట్టూ ఎలాగోలా దాన్ని ఆర్పుకోవాలన్నట్టూ లోని మనిషి కొంగు భుజాల చుట్టూ మలిమి పట్టుకుంది.



## పునాదిరాళ్ళు!

లాల్ బహదూర్ శాస్త్రి అలహాబాద్‌లో తొలిసారిగా (సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ) అనే సంస్థలో ఒక సభ్యునిగా చేరారు. ఆయన కష్టానికి వెనుదియ్యక సాంఘిక సేవను చేసేవాడు. శాస్త్రికి ప్రజలకు సేవ చెయ్యడమే తప్ప, ప్రచారం ఏమాత్రం గిట్టేది కాదు! ఒక రోజున ఓ కార్యకర్త ఆయన్ని అడిగాడు– "మిత్రమా! నీ సేవను గురించి, నీ కార్యకలాపాలను గురించి పత్రికలలో ప్రచురించడానికి నువ్వెందువలన అంగీకరించవు?"

"మిత్రమా! నాకీ విషయంలో లాలా లజపతిరాయ్ చెప్పిన మాటలు బాగా జ్ఞాపకం వున్నాయి. ఆయన ఇలా అన్నాడు– లాల్ బహదూర్! తాజ్‌మహల్ నిర్మాణంలో రెండురకాల రాళ్ళను వినియోగించారు. ఒక రకం పాలరాతితో కట్టారు. పాలరాతితో కట్టిన స్తంభాలు, వగైరా చూపరులను ఆకర్షిస్తాయి. రెండవ రకం రాయిని తాజ్‌మహల్ పునాదుల్లో ఉపయోగించారు. వాటిని ఎవ్వరూ చూడలేరు, మెచ్చుకోలేరు. అవి పునాదిరాళ్ళు. మిత్రమా, నేను ఆ పునాదిరాళ్ళ వలె వుండాలని కోరుకుంటున్నాను" అన్నారు.

–కొడిమెల శ్రీరామమూర్తి

41వ పేజీ తరువాయి

### వీరిని గుర్తు పట్టగలరా?

### ఆ హాలీవుడ్ తారలు వీరే

1. షరోన్ స్టోన్ 2. బ్రూక్ షీల్డ్స్
3. జాన్ ట్రవోల్టా 4. డెమీమూర్
5. సిండీ క్రాఫోర్డ్

'కూచోనేం? నిలువు జీతం యివ్వాలనా!' కొత్త పెళ్ళి కూతురి దగ్గర కనకారావు అచ్చంగా డబ్బునా ననే వేశాడు. ఇబ్బందిగా తలూపి మంచం మీద ఓ మూల కూచుంది. అసలీ గదిలోనే మానవ స్పర్శ తక్కువైనట్టూ డబ్బు రాసిడి ఎక్కువైనట్టూ ఖరీదైన సామాన్లు కంగాలీ కంగాలీగా పేర్చేసినట్టున్నాయి.

నేనీ పెళ్ళి చేసుకోనమ్మా... వాడంటే నా కసహ్యం... నాకొద్దు– అమ్మ చేతులు పట్టుకుని ఏడుస్తున్న విశాలాక్షి ఏడుస్తూనే వుంది నిన్నటి వరకూ.

'అన్నీ తెలిసిందానివి. నువ్వే యిలా మాట్లాడితే.. ఎలాగమ్మా విశాలీ. అన్నయ్య చూస్తే సరయిన వాడుకాదు. ఆ తాగుడు జూదాలు మానమంటే మానడు. నిన్నటికి నిన్న రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడా. మంచికో చెడుకో ఆ కనకరావుండబట్టే బైట పడ్డాం. మా మొహాలు చూసయినా ఈ పెళ్ళి కొప్పుకోవాలమ్మా. మా అమ్మవి కదూ' నాయిన గుర్తొచ్చాడు. నాయన తనకి నాళమ్మ పేరే పెట్టమన్నాడ్ట!

అసలలా ఎవరు మాట్లాడినా తనకి ఏడుపొచ్చేస్తుంది. ఏడుపొస్తే మాట రాదు. ఏడుపెవ్వరు చూడకుండా వుండటం కోసం గబగబా తలూపి అక్కడ్నించి పారిపోడం తప్ప మార్గం లేదు.

అంతకంటే 'చంపి పారేస్తాను జాగ్రత్త. కనకారావుని చేసుకో యిటువంటి జన్మెత్తినందుకు నీకిదే తగిన శిక్ష' అంటే బావుండు. నాన్నెప్పుడూ అలా మాట్లాడ్డు. గడ్డం పట్టుకుని బ్రతిమిలాడతాడు.

నా తల్లివి కదూ ఈ పచ్చడితో అన్నం తినెయ్యమ్మా చందమామ కథ చెప్తాగా– అనేవాడు చిన్నప్పుడు.

నీకు తెలీందేముంది తల్లీ ఎలాగోలా సర్దుకోవాలని గానీ అంటున్నాడిప్పుడు

ఎమోషనల్ బ్లాక్ మెయిల్!

ఆ కనకారావు అన్నయ్య పుస్తకాల కోసం వచ్చి చీకట్లో నా చెంగు లాగాడు నాన్నా!

మొన్నరాత్రి రేషన్ షాపు నుంచి వస్తుంటే ఆ కనకరావు వంద రూపాయలు చేతిలో పెట్టి కన్ను గీటాడమ్మా!

ఆ దొంగ వెధవని రానివ్వకురా అన్నయ్య కంపరం పుడుతోంది. నీ కోసం అని చెప్తే నువ్వు లేకపోయినా వస్తున్నాడ్రా!

ఏ రోజు రిపోర్టు ఆ రోజు యిస్తూనే వుంది విశాలాక్షి.

'ఆహా యింతోటి రంభా వూర్వసి యింకెక్కడా దొరకదని వాడికేమిటే కో... అంటే కోటిమంది. మనింట్లో నెలసరి చిల్లర వాడు తొడిగే చెప్పులకి చాలదు." భయాన్ని మించిన భక్తి, భక్తిని మించిన భుక్తి అన్నయ్యలో విచక్షణ చంపేశాయి.

'నీ కెందుకు నువ్వు తలొంచుకు పో. మెల్లిగా చెబుదాంలే. అయ్యినదానికి కానిదానికి యాగీ చెయ్యకు. ముల్లొచ్చి ఆకుమీద పడినా ఆకొచ్చి ముల్లు మీద పడినా నీకే నష్టం' ఆడ శరీరంతో పుట్టడమే ఓ బానిసత్వం అన్నట్టు మాట్లాడింది అమ్మ.

'ఏం చేస్తాం తల్లీ. గాలిక్కూడా లోకువైపోయిన బతుకులు మనవి' పాతాళగంగలా గురుగురలాడేది నాన్న గొంతు.

లాభం లేదు. వీళ్ళెవ్వరికీ చీమూ నెత్తురూ లేదు. ఎప్పుడో ఓనాడు నేనే చెప్పేస్తాను.

రేయ్ కనకారావూ నీ పేగులు చీల్చి మా గుమ్మానికి తోరణం కట్టకపోతే అడుగు. నీ నెత్తురు పిండుకుని రేపు నే కొనుక్కోబోయే తెల్ల జరీ చీరకి అంచు నేయించుకుంటాను కాచుకో. వస్తావుగా ఎప్పుడో చూద్దువుగాని నా తడాఖా– రోజుకో కొసిని డైలాగులు కూడబలుక్కుని రంగం సిద్ధం చేసుకుంది విశాలాక్షి.

అదేమీ చిత్రమో కనకారావు ఆ వారం రానేలేదు.

విశాలాక్షి టెన్షన్‌గా ఎదురు చూస్తోంది.

వస్తాడు కదా రానివ్వాలి. లోపలికొచ్చి సింహాసనం మీద కూచున్నట్టు పడక్కుర్చీలో కూచుంటాడు.

వెధవ మిడిగుడ్లేసుకుని కళ్ళల్లోకి చూస్తాడు. ముద్దు పెడతాను జాగ్రత్త అన్నట్టు మూతి ముందుకు చాపుతాడు. వూరుకోవాలి. ఏం పట్టించుకోనట్టే ఓపిక పట్టాలి.

వైజయంతిమాల నీ కంటే ఏమీ బావుండదంటాడు. ఇంత పాతబడ్డ ఓణీ లెందుకు వేస్తావ్. ఆ జాకెట్టు నంబరన్నా చెప్ప నేను కొంటాను. అంత మరీ పవిత్రత చూపు చూడక్కర్లేదులే కొంటాననే వాడ్ని కొరికి దయ్యంలా చూస్తావు. ఏమీ కొన్లేని నాన్నని పట్టుకుని పాకులాడుతూ వుంటావు అంటాడుగా. వాడి నోటికి హద్దుండదు. అప్పడనేస్తాను.

'ఒరి నీ మొహం ఈడ్చా! నేనేం కట్టుకుంటే నీకెందుకురా నిబ్బాసి వెధవా. అంత మరీ డబ్బెక్కువై ఛస్తుంటే నీ అమ్మకీ అప్పకీ కొన్నా. వైజయంతి మాల కోకలు కొను. జ్యోతిలక్ష్మి గోచీలు కొను. నీ యిష్టం వచ్చినవి కొను. మా గుమ్మం తొక్కడానికి మటుక్కూ వీలులేదు' అన్నాలి. ఒక్క ముక్క కూడా మర్చిపోకూడదు. రానీయ్ రానీయ్ పది రోజులవుతోంది. రాడేమిటో ఫకీరు వెధవ. విశాలాక్షికి నిరీక్షణ ఎక్కువైపోయింది. ఒక్కసారొచ్చి చెయ్యి పట్టుకుంటే చాలు చెంప పగులగొట్టడం, అనాల్సిన నాలుగూ అనెయ్యడం ఓ పనయిపోతుంది.

చూడగా చూడగా కనకారావు రానే వచ్చాడు. పాములా పాక్కుంటూనా? కాదు మహా ఠీవిగా నిర్లజ్జగా నీటి గుర్రంలా తలెగరేస్తూ వచ్చాడు. ఆ వెనకే పిల్లిలా అన్నయ్య.

ఎదురింటి డాబా పిట్టగోడమీద కూర్చొని నేస్తురాలు కల్పనతో కలిపి గోరింటాకు పెట్టుకుంటోంది విశాలాక్షి. 'అదిగో వచ్చాడేవ్ నీ కనకారావు' అంది కల్పన గుసగుసగా.

'పళ్ళూడగొడతాను జాగ్రత్త. అంతా నీవీ అదేం మాట. నా కనకారావేమిటి ఛండాలంగా ఛీఛీ యాక్' డొకొచ్చినట్టు మొహం పెట్టింది విశాలాక్షి.

'యమ ధర్మరాజు వాహనం లాగా నల్ల న్కూటరూ వాడూనూ వాడల్లాగే వస్తాడోయ్. మా యింట్లో ఎవ్వరికీ యిష్టం లేదు' అంది చాతన యినంత విరుసుగా యింకోసారి.

'మీ అన్నయ్యకి ఫ్రెండంటగా మరి' అంది కల్పన తెల్లబోతూ. అదే నా ఖర్మ అన్నట్టు పాపభారంతో తలొంచి 'వస్తానే' అంటూ నాలుగు మెట్లు దిగి అప్రయత్నంగా ఆగిపోయింది. తనింట్లో గొడవేదో రాజుకున్నట్టుంది. అమ్మెందుకో చేతులు జోడించి కనకరావుకి దణ్ణం పెడుతోంది. మధ్య మధ్య కొంగుతో కళ్ళొత్తుకుంటోంది. అలో లక్ష్మణా అన్నట్టు నాన్న గోడకి జార్లబడి ఎటో చూస్తున్నాడు. శ్రీరాములవారి పాదుకల వంక చూస్తున్న నిరాంజనేయుడిలాతలొంచి నేల చూపులు చూస్తున్నాడు అన్నయ్య.

వద్దు ఇప్పడప్పలు వెళ్ళకూడదు. కొంపలంటించే పని ఏదో అన్నయ్య చేసే వుంటాడు, కనకారావు డబ్బుతో కప్పెట్టి కాపాడుకొస్తుంటాడు. ఈ టైమ్‌లో కనిపిస్తే వాడు కొట్టే ఆ కారణజన్ముడి ఫోజుంది చూడు అది చూడ్డం కష్టం అనుకుని కల్పనా వాళ్ళింట్లోనే కొంతసేపు ఆగిపోయి ఎప్పటికో ఇంటికెళ్ళింది విశాలాక్షి. ఆ రాత్రి అన్నాల దగ్గర అమ్మ చివాట్లనీ, ముక్కు చీదుళ్ళనీ, నాన్న ష్... ఎవరైనా వింటారు అనే నిట్టూర్పుల మధ్య అసలు విషయం అర్థమైపోయింది. అది కొత్త విషయం కూడా కాదు. తన అన్నగారైన వీర నరసింహం మెట్రిక్కు ఫెయిల్యూర్‌గారు నవరంగ్ థియేటర్ ముందు బ్లాక్ టిక్కెట్లు అమ్ముతూ రెడ్‌హేండెడ్‌గా పట్టుబడ్డమే కాక దగ్గరకొచ్చిన పోలీసు కానిస్టేబుల్ని ఒక్కతోపు తోసి పారిపోయే ప్రయత్నంలో సినిమా టిక్‌గా కనకారావు ఎదురుపడటమూ, సదరు కనకారావు తన పలుకుబడి ఉపయోగించి తగిన ఫైను కట్టి తెలిగ్గా విడిపించి తీసుకు రావడమూ జరిగాయట! అంచేత ఇంట్లో వాళ్ళకిప్పడు కనకారావు డబ్బూ పలుకుబడీ వున్న మార్రాజే కాదు . ఆపద్బాంధవుడూ అనాథ రక్షకుడూ కూడా అయిపోయాడు. అయితే అయ్యాడు అనవసరంగా దానివల్ల అతని చెంప పగలగొట్టే కార్యక్రమాన్ని విరమించుకోవాల్సి వచ్చింది విశాలాక్షికి. అక్కడితో అవలేదు. అసలు ప్రమాదం కనకారావు తల్లి రూపంలో ఎదురొచ్చింది. ఆవిడ ఎప్పట్నించో చెడు తిరుగుళ్ళు మరిగిన కనకారావుకి చెడిపోయిన తన ఆరోగ్యాన్నికీ కలిపి నమ్మకమైన పని కత్తె కోసం చూస్తోంది. డబ్బులేని వాళ్ళ పిల్లయితే అణిగి మణిగి వుంటుందనేది. అనుభవంలో కొచ్చిన విషయం కాగా ఎంతో కొంత చక్కనిదైతే కొడుకు యింటిపట్టున వుంటాడనేది శ్రేయోభిలాషుల సలహా. ఆవిడ విసిరిన గాలంలో విశాలాక్షి కుటుంబం యిట్టే పడింది. అసలే కృతజ్ఞతా భారంతో లొంగిపోయిన విశాలాక్షి తల్లిదండ్రులకి ఈ రూపేణా గుళ్ళో దేవత ప్రత్యక్షమైనట్టయింది.

పెళ్ళిమంటూ పెళ్ళయింది. గుభిల్లుమంటూ మనసులోపల ఏదో కూలినట్టయింది విశాలాక్షికి.

మాట్లాడకుండా కూచున్న కొత్త పెళ్ళాన్ని అత్యాచారంతో మచ్చిక చేసుకుంటున్నాడు కనకారావు.

లైసెన్స్‌డ్ రేప్

ఇది వరకెప్పడన్నా అయితే మా నాన్నతో చెప్తాను జార్త అనో అమ్మని పిలవమంటావా అనో ఏదో ఒక పనికిరాని బెదిరింపన్నా వుండేది. ఇప్పడలాంటి ఆశలేం వున్నాయని! చీమంత ప్రతిఘటన అయినా లేకుండా నిస్తేజంగా వొళ్ళప్పజెప్పింది విశాలాక్షి.

వొంటికీ మనసుకీ లింకు తెగిపోయిన విశాలాక్షిని మడత విప్పని జరీ అంచు తెల్లచీర జాలి జాలిగా చూస్తోంది.

'రంభవని చేస్కోలేదే. అమ్మని చూసుకుంటానని... నా ఇంట్లో చోటిచ్చాను... అది తెలుసుకుని మసలుకో' అన్నాడు జరిగిన శోభనానికి ముక్తాయింపుగా కనకారావు.

తెలుసు అన్నట్టు పైకి తలూపింది.

తెలీకేం. మా అమ్మకి మల మూత్రాలు ఎత్తిపొయ్యాలి. నా మాటలు బుద్ధులూ భరించాలి. అదే కదా మా వాళ్ళకు నేనిచ్చిన అగ్రిమెంటు– అనుకుంది లోపల్లోపల.

విశాలాక్షికిప్పడు ముప్పయ్యారేళ్ళొచ్చాయి. ముగ్గురు పిల్లలకు తల్లయింది. పెద్దింటి కోడలవడం వల్ల ఎందరికో తన చేతుల మీదుగా చీరలు పెట్టింది. అందుకుంది. అందులో జరీఅంచు తెల్లచీరలూ కొన్నున్నాయి. కానీ గడి విప్పి కట్టిన ప్పడల్లా ఏదో మరక చీరమీద అలుక్కుపోయినట్టే అనిపిస్తుంది. సాములో తేళ్ళో కనిపించకుండా పాకుతున్నట్టే అనిపిస్తుంది. కొన్ని సార్లసలు తమాయించుకోలేక నల్లచీరలోకో బురదరంగు చీరలోకో మారిపోయి హమ్మయ్య అనుకుంటుంది.

(రావిశాస్త్రి కథ 'జరీ అంచు తెల్లచీర' చదివి దానికో చిన్న కొనసాగింపు యివ్వాలనే చాపల్యంతో...)



# మూడు రొట్టెలు!

ఒక విందులో సర్వేపల్లి రాధాకృష్ణన్ పాల్గొన్నారు. ఆ విందుకు ఒక ఆంగ్లేయుడు కూడా హాజరయ్యాడు. అతను తమ ఆంగ్ల జాతిని అదే పనిగా పొగడసాగాడు.

"మా ఇంగ్లీషు ప్రజలంటే, భగవంతునికి చాలా ఇష్టం! ఆయన మమ్మల్ని ఎంతో ప్రేమతో అతి జాగ్రత్తగా తయారుచేశాడు!" అన్నాడు ఇంగ్లీషు ఆసామి.

అతను గొప్పగా చెప్పకోవడం రాధాకృష్ణన్‌కు నచ్చలేదు. ఆయన అక్కడున్నవారితో ఇలా అన్నాడు–

"మిత్రులారా! దైవం కొన్ని రొట్టెలను తయారుచేయాలని భావించాడు. ఆ విధంగా ఆయన తయారుచేసిన మొదటి రొట్టె సరిగ్గా ఉడకలేదు. దానిలోనుంచే ఇంగ్లీషువారు జన్మించారు. దైవం రెండవ రొట్టెను తయారుచేసే ముందు చాలా శ్రద్ధ తీసుకున్నాడు. మొదటి రొట్టె వలె రెండవది కూడా ఉడకదేమోనని భావించాడు. ఆయన దాన్ని చాలాసేపు కాల్చాడు. చివరికి అది మాడిపోయింది. అందులోనుంచి నీగ్రోవారు జన్మించారు. మూడవ రొట్టెను చేసేముందు దైవం అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాడు లోగడ రెండు రొట్టెల విషయంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా! అందువలన మూడవ పర్యాయం తయారయిన రొట్టె ఉడకవలసినంత ఉడికి, కాలవలసినంత కాలింది. అది అన్ని విధాలా బావుంది. ఆ రొట్టెనుంచి మా భారతీయులం జన్మించాం" అన్నారు. ఆయన చెప్పింది విని ఇంగ్లీషు ఆసామి సిగ్గుతో తలవంచుకున్నాడు. అక్కడున్న జనమంతా నవ్వులను పువ్వులుగా కురిపించారు.

–కొడిమెల శ్రీరామమూర్తి